క్లుప్తంగా

శాసనసభాపతి ప్రసాద్‌కు శుభాకాంక్షలు



స్పీకర్‌ను సన్మానిస్తున్న జీడి వీరస్వామి

అర్వపల్లి : శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌ను గురువారం హైదరాబాద్‌లో తిమ్మాపురం మాజీ సర్పంచ్ జీడి వీరస్వామి కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రసాద్ తెలంగాణ తొలి దళిత శాసనసభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

నవగ్రహ శాంతి హోమం



పూజల్లో పాల్గొన్న భక్తులు

నూతనకల్ : బాధ్యతండాలోని శ్రీ కనకదుర్గ ఆలయంలో జిల్లా కాంగ్రెస్ నాయకుడు గుగులోతు కృష్ణ నాయక్ ఆధ్వర్యంలో గురువారం నవగ్రహ శాంతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోలాట నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ తహసీల్దార్ ప్రసాద్, కృష్ణనాయక్, రవీందర్ నాయక్, శంకర్ నాయక్, పంతుల్యా, సురేందర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సన్మానం

అర్వపల్లి : హైదరాబాద్‌లో శుక్రవారం జరిగే మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టీపీసీసీ కల్లుగీత కార్మిక విభాగం రాష్ట్ర కార్యదర్శి బద్దం యాదగిరిగౌడ్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంత్రి వర్గంలో గౌడ్‌లకు ప్రాధాన్యం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



జాజిరెడ్డిగూడెంలోని చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న క్రైస్తవులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని చర్చిలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రార్థనలు చేసిన అనంతరం కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో పాస్టర్ రత్నాకర్, జోసఫ్, అక్కులు, రెంటాల కరుణకుమార్, సోమయ్య, అబ్రహం, పగిడిమర్రి శీల, శకుంతల, పద్మ, విజయశ్రీ, సౌందర్య, సోమలక్ష్మి, నాగమ్మ, వెంకటమ్మ, మేరి, శోభ, ఏసుమణి, అశ్విని, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ట్యాప్‌లు పనిచేయక నీళ్లు వృథా



వృథాగా పోతున్న నీరు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో నల్లా ట్యాపులు పనిచేయక పోవడంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయం ఎదుట మూడు నల్లా ట్యాపులను ఏర్పాటు చేశారు. అయితే ఈ ట్యాపులు పనిచేయడంలేదు. దీంతో నిరంతరం నీళ్లు వృథా అవుతున్నాయి. ఆలయ అధికారులు ట్యాపులను ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

అంగవైకల్య నివారణకు కృషి చేయాలి

నూతనకల్ : అంగవైకల్య నివారణకు కృషి చేయాలని ఫిజియోథెరపీ వైద్యుడు కృష్ణ అన్నారు. గురువారం మండల రీసోర్స్ భవనంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలతో పలు ఎక్సర్‌సైజ్‌లు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల తల్లిదండ్రులు ఇంటి దగ్గర క్రమం తప్పకుండా పిల్లలతో ఎక్సర్‌సైజ్‌లు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రాములునాయక్, హెచ్ఎం విద్యాసాగర్, ఐఆర్టీ అప్పారావు పాల్గొన్నారు.



ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న వైద్యుడు

నిధులు లేకుంటే నిర్వహణ ఎలా..

- రైతు వేదికలకు 17 నెలలుగా నిలిచిన నిధులు
- ప్రభుత్వం నెలకు రూ.9వేలు ప్రకటించినా రాని బడ్జెట్
- కనీస వసతులు లేక రైతులు, అధికారులకు ఇబ్బందులు



రామన్నగూడెంలో ప్రహరీ లేని రైతువేదిక



నిరుపయోగంగా మారిన టాయిలెట్లు

అర్వపల్లి : రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వడానికై ఏర్పాటు చేసిన రైతు వేదికల నిర్వహణ నిధులు రాక సమస్యగా మారింది. ప్రతి నెలా వేదికల విద్యుత్ బిల్లులు, కనీస వసతుల కల్పన, స్వీపర్ల వేతనాలు, కార్యాలయాల నిర్వహణ తదితర ఖర్చులకై ప్రభుత్వం నెలకు రూ.9వేల చొప్పున చెల్లించాల్సి ఉంది. అయితే గతేడాది ఆగస్టు నుంచి ఇప్పటి వరకు 17 నెలలుగా నిర్వహణ ఖర్చులు రావడంలేదు. దీంతో వేదికల నిర్వహణ వ్యవసాయ అధికారులకు కష్టంగా మారింది. విద్యుత్ బిల్లులు నెలనెలా చెల్లించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో వ్యవసాయ శాఖ సిబ్బందే తమ జీతాల డబ్బులను కరెంటు బిల్లులకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

కొరవడిన కనీస వసతులు..

జాజిరెడ్డిగూడెం మండలంలోని రామన్నగూడెం, తిమ్మాపురం రెండు గ్రామాల్లో రైతు వేదికలను క్లస్టర్ల వారీగా నిర్మించారు. తిమ్మాపురంలో ఊరి శివారులో, రామన్నగూడెంలో హైవే వెంట అర్వపల్లి–రామన్నగూడెం మధ్య నిర్మించారు. ఒక్కో రైతు వేదిక నిర్మాణానికి రూ.22లక్షలు ఖర్చు చేశారు. కానీ వీటి నిర్మాణంలో నాణ్యత లోపించి టాయిలెట్లు పనిచేయడం లేదు. రామన్నగూడెంలో టాయిలెట్ల నుంచి నీళ్లు బయటకి వెళ్లకపోవడంతో నిరుపయోగంగా మారాయి. తిమ్మాపురం రైతు వేదికలో నీటి సమస్య ఏర్పడింది. రైతు వేదికలు ఊరి శివార్లలో ఉండటం, ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో మద్యం ప్రియులు, పగటి వేళల్లో మూగజీవాలు పాడు చేస్తున్నాయి. హాల్స్‌కు కిటికీలు లేకపోవడంతో దుమ్ము, ధూళి చేరి వేదికలు మట్టితో నిండిపోతున్నాయి.

నిధులు విడుదల చేయాలి



రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైతు వేదికల్లో సమస్యలను తీర్చాలి. అలాగే ప్రతినెలా నిర్వహణ కోసం చెల్లించే రూ.9వేల బడ్జెట్‌ను విడుదల చేయాలి. ఏడాదిన్నర నుంచి బడ్జెట్ విడుదల చేయకపోవడం తగదు.

\- వజ్జె శ్రీనివాస్, రైతు సంఘం నాయకుడు

ఉన్నతాధికారులకు తెలిపాం



రైతు వేదికల నిర్వహణకు నెలనెలా బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది. రైతు వేదికల్లో టాయిలెట్లు సరిగా పనిచేయకపోవడంతో విషయాన్ని పీఆర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రహరీల నిర్మాణం పైస్థాయిలో జరగాల్సి ఉంది. చిన్నచిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

\- శశిధర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి

ఆలయాలను సందర్శించిన విద్యార్థులు



అర్వపల్లి దేవాలయంలో విద్యార్థులకు ఆలయ విశిష్టతను వివరిస్తున్న అర్చకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని చారిత్రక ఆలయాలను గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీస్వామినారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం సందర్శించారు. తొలుత తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని సందర్శించి క్షేత్రం ఆవరణ మొత్తం తిరిగి విశిష్టతను తెలుసుకున్నారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్ ఆలయాన్ని కూడా సందర్శించారు. అక్కడి నుంచి అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ ఆలయ చరిత్రను అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్‌లు తెలియజేశారు. ఈ సందర్భంగా స్కూల్ ఉపాధ్యాయ బృందాన్ని అర్చకులు సన్మానించారు. అలాగే స్థానిక శ్రీయోగా షిరిడీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించి అక్కడే భోజనాలు చేసి వెళ్లారు. ఈ కార్యక్రమంలో గురుకుల్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ఆనంద్, పాఠశాల డైరెక్టర్ హార్దిక్, ఉపాధ్యాయుల బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సామేల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తిరుమలగిరి : తుంగతుర్తి శాసన సభ్యుడిగా ఎన్నికైన మందుల సామేల్‌ను నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నాయకులు కందుకూరి సోమయ్య, సోమశేఖర్, ఖాసీమ్, బొజ్జ సైదులు, బాలయ్య, కందుకూరి శ్రీను, గంగయ్య, పరశురాములు, ప్రశాంత్, చిరంజీవి, శ్రీరాములు, వెంకన్న, ప్రకాష్, అనిల్, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌ల ఎదుట ఉద్యోగుల సమ్మె



తుంగతుర్తిలో సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు



అర్వపల్లిలో పోస్టాఫీస్ ఎదుట..

అర్వపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని తపాలా ఉద్యోగులు గురువారం అర్వపల్లిలోని సబ్ పోస్టాఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్స్‌లను అమలు చేయాలని, 180 రోజుల పెయిడ్‌లీవ్స్ దాచుకునే సౌకర్యం కల్పించాలని, జీడీఎస్‌లను డిపార్ట్‌మెంట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వ వైద్య సదుపాయం కల్పించాలని, అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు నోముల మహేష్, ఎస్‌డీ. మధార్, రాజు, గౌస్, శ్రీనునాయక్, రామాచారి, గోపి, యాకూబ్‌అలీ, సాయిమాధవ్, సతీష్, నవీన్, రమ్య, భవానీ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : తపాలా ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎన్‌యూజీడీఎస్ డివిజన్ కార్యదర్శి నరసింహుల సంతోష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని తపాలా కార్యాలయం ఎదుట చేపట్టిన మూడవ రోజు నిరవధిక సమ్మెలో పాల్గొని మాట్లాడారు. తపాలా ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అన్నారు. కమలేష్ చంద్ర కమిటీ చేసిన 11 సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బీపీఎంలు గౌతమ్, షబ్బీర్, ప్రదీప్, రమేష్, గణేష్, వేణు, సందీప్, సంతోష్, లతీఫ్, సలీం, నాగయ్య, వెంకటేశ్వర్లు, ఉదయశ్రీ, మానస, సంధ్య, నబీ, మానస తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పనితీరులో మార్పురావాలి

- నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు
- కార్యాలయాల తనిఖీ నివేదికపై వెబెక్స్‌లో కలెక్టర్ వెంకట్రావు



వెబెక్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి : మండల, గ్రామపంచాయతీ అధికారుల పనితీరులో మార్పురావాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామపంచాయతీల భవనాల నిర్మాణాలను డీపీఓ, జిల్లాలోని పాఠశాలలు, అంగన్‌వాడీలను డీఈఓ, కళాశాలలను డీఐఈఓ, రైస్ మిల్లులు, మీ సేవా కేంద్రాలను ఆర్డీఓలు, తహసీల్దార్లు, మండలాల్లోని అభివృద్ధి పనులను మండల ప్రత్యేక అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేసి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం కలెక్టర్ వెంకట్రావ్ అదనపు కలెక్టర్లు ప్రియాంక, వెంకట్‌రెడ్డిలతో కలిసి వెబెక్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు తనిఖీ వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. ఎస్ఆర్ఈజీఎస్, ఎంపీడీఓ, ఎంపీఓల పనితీరు బాగాలేదని, నర్సరీల్లోని బ్యాగుల్లో మొక్కలు సరిగా పెరగడంలేదని, కొన్ని అంగన్వాడీ సెంటర్లలో పిల్లలకు కోడిగుడ్లు అందడం లేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. నర్సరీల్లో 50 శాతానికి మించి మొక్కలు లేవని, సంపద వనాలు, క్రీడా ప్రాంగణాలు, గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ సరిగా లేదని తెలిపారు. జిల్లాలోని 5 మిల్లులు సీఎంఆర్ లక్ష్యాన్ని పూర్తి చేయడం లేదని అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గ్రామ, మండల స్థాయి అధికారుల పనితీరులో మార్పు రాకపోతే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఎంఆర్ డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయని మిల్లులపై క్రిమినల్ కేసులు పెట్టి తగు చర్యలు తీసుకోవాలని డీఎస్ఓ మోహన్‌బాబును ఆదేశించారు.

సంత వేలం వాయిదా

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని నెమ్మికల్ పశువుల సంత వేలాన్ని వాయిదా వేసినట్లు డీఎల్‌పీఓ సాంబిరెడ్డి తెలిపారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంత వేలం కార్యక్రమాన్ని నిర్వహించగా పాటదారులు సమయానికి హాజరు కాలేదని, దీంతో ఈనెల 21వ తేదీన చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, ఎంపీఓ సంజీవ, సర్పంచ్ దావీద్, ఎంపీటీసీ ముత్తయ్య, ఉపసర్పంచ్ ఉపేందర్, పంచాయతీ కార్యదర్శులు హరికృష్ణ, శమీ, నాగరాజు, సైదులు, ముత్తయ్య పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం



తిరుమలగిరిలో డ్రెయినేజీ మరమ్మతు పనులు చేయిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో మోత్కూరు రోడ్డు వైపు ఉన్న డ్రెయినేజీని గురువారం మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం అనే శీర్షికన గురువారం సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ సిబ్బంది స్పందించి పనులను ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్ దగ్గరుండి రోడ్డు మీదకు నీళ్లు రాకుండా కాల్వలను శుభ్రం చేయించారు.

రహదారులు అధ్వానం.. ప్రయాణం నరకం

- గుంతలమయంగా మద్దిరాల – ముకుందాపురం, పోలుమల్ల – చందుపట్ల రోడ్లు
- ఇటీవల బీటీ పనులు ప్రారంభించినా ఎన్నికల కోడ్‌తో మధ్యలోనే నిలిపివేత
- త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న ఆయా గ్రామాలవాసులు



పోలుమల్లలో అధ్వానంగా ఉన్న రోడ్డు



పనుల్లో భాగంగా ముకుందాపురం- మద్దిరాల రూట్‌లో గతంలో చేపట్టిన కల్వర్టు నిర్మాణం

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రం నుంచి ముకుందాపురం, పోలుమల్ల నుంచి చందుపట్ల గ్రామానికి ఉన్న రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రూట్లలో నిత్యం రద్దీ ఎక్కువగా ఉంటుంది. కానీ రహదారులు సరిగాలేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పైగా ఇటీవల వర్షాలు విపరీతంగా కురవడంతో రోడ్లపై గుంతలు మరింతగా పెరిగాయి. అయితే ఆరు నెలల క్రితం మద్దిరాల నుంచి ముకుందాపురం వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2.55కోట్లు, పోలుమల్ల నుంచి చందుపట్ల గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం రూ.1.33కోట్లు మంజూరు కాగా నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. కానీ ఈలోగా అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులను నిలిపివేశారు. అధికారులు వెంటనే స్పందించి బీటీ రోడ్డు పనులను తిరిగి వెంటనే చేపట్టాలని, ప్రయాణికుల సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే పనులను చేపట్టాలి



365 జాతీయ రహదారి నుంచి పోలుమల్ల గ్రామానికి వెళ్లే ప్రధాన బీటీ రోడ్డు తీవ్రంగా దెబ్బతిన్నది. రోడ్డంతా గుంతలమయంగా మారి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో నూతన రోడ్డు పనులను త్వరగా చేపట్టాలి. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించాలి.

\- పాక అమృతమల్లు, పోలుమల్ల

పనులు ప్రారంభించి ఆపేశారు



365 జాతీయ రహదారి నుంచి ఊరిలోకి వెళ్లే బీటీ రోడ్డు వర్షాల కారణంగా గుంతలమయంగా మారింది. అయితే ఆరు నెలల క్రితమే నూతన రోడ్డు మంజూరైంది. కానీ పనులు సరిగా చేపట్టకముందే ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయాయి. అధికారులు వెంటనే రోడ్డు పనులను మొదలుపెట్టి త్వరగా పూర్తి చేయాలి.

\- బెజ్జంకి లింగారెడ్డి, చందుపట్ల

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

మోతె : కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీసర సంతోష్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో ఇటీవల మృతి చెందిన ధర్మపురి లక్ష్మయ్య కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నందిగామ కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ బొర్ర మధుసూదన్, మండల యూత్ అధ్యక్షుడు ఎలుగు వీరన్న, ఉప్పుల వినోద్, నూకల రాజిరెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మాలధారులకు అన్నదానం

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో గురువారం దాతల సహకారంతో సుమారు 600 మంది మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రేపాల ప్రసాదరావు, చల్లా రామ్మూర్తి తెలిపారు. పట్టణానికి చెందిన కొత్తూరు పూర్ణచందర్‌రావు, రాధా, గోళ్ల వెంకటేశ్వరరావు, నాగమణి కుటుంబసభ్యులు అన్నదానం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, గురుస్వామి రామనాథం, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న దాతలు

భానుపురి : ఎలిజిబెత్ ప్రభుదాస్ జ్ఞాపకార్థం స్థానిక సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ ఆవరణలో గురువారం సుమారు 400 మంది వితంతువులు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ బాప్టిస్ట్ కన్వెన్షన్ వైస్ ప్రెసిడెంట్, సెంటినరి బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ ఎం.ప్రభుదాస్ మాట్లాడారు. 13 ఏళ్లుగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 14న కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని, ప్రేమను పంచడమే క్రైస్తవ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు ప్రభుకిరణ్, ప్రతిభ కిరణ్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు పూర్ణా శశికాంత్, బాప్టిస్ట్ చర్చ్ సంఘ పెద్దలు వంగూరు దానియేలు, ఎలియజర్, రాజశేఖర్, స్త్రీల సమాజం అధ్యక్షురాలు పెద్దపంగా కవితరవి, ఎడవెల్లి సువార్త రత్నం, వల్లపుదాసు అరుణ అనిల్, పెద్దపంగ తులసి జఫనియా, గూగుల శ్రీనివాస్, చెట్టుపల్లి రాజకుమారి, కిరణ్, అనిల్, విక్టర్, పోకల ప్రవీణ్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

భానుపురి : సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం హనుమాన్ శోభాయాత్రను హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో 37 మంది హనుమాన్ దీక్ష చేపట్టి 41 రోజులు పూజల అనంతరం ఈ శోభాయాత్రను నిర్వహించినట్లు స్వాములు తెలిపారు. పురవీధుల గుండా కోలాట నృత్యాలతో చేసిన ప్రదర్శన ఊరేగింపు పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రామాంజనేయ చార్యులు, ఆలయ చైర్మన్ కొత్త ఆంజనేయులు, స్వాములు డాక్టర్ అనీల్ కుమార్, శ్రీనివాస్, కలకోట శ్రీనివాస్, తండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో శోభాయాత్ర నిర్వహిస్తున్న శ్రీఆంజనేయ స్వామి దీక్షాపరులు

బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే



నూతనకల్: భాగ్యతండాలో సర్వే చేస్తున్న సిబ్బంది



నాగారం : లక్ష్మాపురంలో..

నూతనకల్ : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడం కోసం విద్యాశాఖ అధికారులు గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదువు మధ్యలో మానేసిన పిల్లలను గుర్తించడంతోపాటు పాఠశాలకు వెళ్లని వారిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించడానికి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : లక్ష్మాపురం, హేమ్లతండా, మేగ్యాతండాల్లో బడి బయట ఉండే పిల్లలను గుర్తించేందుకు గురువారం క్లస్టర్ సీఆర్పీ స్వామిగౌడ్ ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడిలో ఉండాల్సిన చిన్నారులు పనులకు వెళ్తుంటే వారిని గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బడిబయట పిల్లలు, మధ్యలో బడిమానేసిన పిల్లలు, నెలరోజులకు పైగా తరగతులకు హాజరుకాని పిల్లల వివరాలు తెలుసుకొని ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం యాకస్వామి పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల తనిఖీ

మునగాల : మీసేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధికంగా వసూలు చేస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు ఉంటాయని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ హెచ్చరించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ రాధారెడ్డి, శ్రీనివాసరావు ఉన్నారు.



మీసేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

మోతె : మండల కేంద్రంలో నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ మెట్టు అలివేలునారాయణరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొక్క ఉపేందర్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరిన్ని నిధులు మంజూరు చేయించి మోతె గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దోసపాటి రాములు, మాజీ సర్పంచ్‌లు గురిజాల వెంకన్న, ఇండ్ల జయమ్మవెంకన్న, బొల్లం రాములు, జలగం ఆంజనేయులు, బొడ్డు నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ చిన వెంకటరెడ్డి, దోసపాటి చిరంజీవి, బొడ్డు సాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలి

అనంతగిరి : ప్రతిఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని సిరి ఫౌండేషన్ చైర్మన్ మొలుగూరి గోపి కోరారు. గురువారం మండలంలోని చనుపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో రైతులకు చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతు తమకున్న వ్యవసాయ భూమిలో కొంత మేర కుటుంబ అవసరం కోసం చిరుధాన్యాలను సాగు చేసుకోవాలన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకుంటే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, దీర్ఘకాలిక ప్రయోజనం ఉంటుందన్నారు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకవన్నారు. చిరుధాన్యాల సాగుపై యాజమాన్య పద్ధతులు, మెళకువలను వివరించారు. కార్యక్రమంలో రైతులు ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, నాగయ్య, నల్ల భీమారెడ్డి, క్లో క్రిష్టారెడ్డి, నర్సిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.